
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
5
బుధవారం, 7 ఆగస్టు 2024



ఇంటిస్థలం 300 గజాలు మించితే..
ఇంకుడు గుంత తప్పనిసరి

- నోటీసులు జారీ చేసిన కేఎంసీ అధికారులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 6: పట్టణాల్లో అధికమవుతున్న సిమెంట్ నిర్మాణాలతో భూగర్భ జలాల సమస్య ఏర్పడుతోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో భూగర్భ జలాలను పెంపు నిర్ణయాలను తీసుకొంది. ఈ క్రమంలో నగరాల్లో 300 గజాలకు పైగా ఇళ్ల, ఇంటి స్థలం ఉన్న నివాసాలకు ఇంకుడు గుంతలను తప్పనిసరి చేసింది. దీంతో ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు ఖమ్మంలోని 700 అపార్టుమెంట్లు, నివాసాలకు నోటీసులు పంపిణీని షూరు చేశారు. వారం రోజుల్లోగా నోటీసుల ప్రక్రియ పూర్తి చేసి ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం జరిగింది. ఇందుకోసం కేఎంసీ అధికారులు ప్రత్యేకంగా ఉద్యోగులను కేటాయించారు.



పదవీకాలం పూర్తయిన సందర్భంగా ఖమ్మం జడ్పీ సభ్యుల గ్రూప్ ఫొటో

ముగిసిన జడ్పీ పాలన

- రెండు జిల్లా కేంద్రాల్లో ఘనంగా వీడ్కోలు సమావేశాలు
- ఖమ్మంలో ఉద్వేగంగా సాగిన చివరి సర్వసభ్య సమావేశం
- అనుభవాలు, జ్ఞాపకాలను మననం చేసుకున్న సభ్యులు
- ప్రజల సహకారంతో సమస్యలు పరిష్కరించామని వెల్లడి
- బరువెక్కిన హృదయాలతో ఒకరికొకరు వీడ్కోలు
- కొత్తగూడెంలో చైర్మన్ కంచర్లకు ఘనంగా సత్కారం

ఖమ్మం కలెక్టరేట్ / చుంచుపల్లి(కొత్తగూడెం) ఆగస్టు 6: ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీకాలం మంగళవారంతో ముగిసింది. రెండు జిల్లా కేంద్రాల్లో సభ్యులకు అధికారులు వీడ్కోలు పలికారు. అలాగే సభ్యులు తమ పదవీకాలానికి సంబంధించిన జ్ఞాపకాలను, అనుభవాలను పంచుకున్నారు. కొందరు భావోద్వేగం చెందారు. సమావేశం అనంతరం ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 23 మండలాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ఏర్పాటు చేసిన తర్వాత, 21 మండలాలతో ఖమ్మం జిల్లా ఏర్పడింది. అనంతరం 2019లో జరిగిన ప్రాదేశిక ఎన్నికల్లో జడ్పీ చైర్మన్‌గా బీఆర్ఎస్ నుంచి లింగాల కమల్‌రాజ్ ఎంపికయ్యారు. అప్పటి బీఆర్ఎస్ సర్కారు హయాంలో జడ్పీ నుంచి అనేక అభివృద్ధి పనులను చేపట్టారు. అయితే కోవిడ్ తో రెండేళ్లు, అరకొర నిధులతో చూస్తుండగానే సభ్యుల పదవీకాలం ముగిసిపోయింది. ఈ క్రమంలో పదవీకాలం చివరి రోజైన మంగళవారం జడ్పీ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలును ఏర్పాటు చేశారు. అనుభవాలు, జ్ఞాపకాలను పదిలం చేసుకుంటూ బరువెక్కిన గుండెలతో సభ్యులంతా ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు. క్షేత్రస్థాయిలో చిన్నిచిన్న ఇబ్బందులు పడినా ప్రజల సహకారంతో వాటిని అధిగమించగలిగామని అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్నప్పుడు జడ్పీలకు నిధులు పెద్దమొత్తంలో వచ్చేవని జిల్లాల పునర్విభజన అనంతరం తగ్గిపోయాయని బాధను వ్యక్తం చేశారు. సమావేశాలను ఎలాంటి ఆందోళనలు లేకుండా నిర్వహించగలిగామని జడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ పేర్కొన్నారు.

వైద్యశాఖపై చివరి చర్చ

మంగళవారం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అధ్యక్షతన జిల్లా వైద్య ఆరోగ్యశాఖపై చివరి చర్చను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో గ్రామపంచాయతీల పాలనను ప్రత్యేక అధికారులు నిర్వహిస్తున్న నేపథ్యంలో పారిశుద్యం లోపించిందని దీని ద్వారా అనేక గ్రామాల్లో పారిశుద్యం సమస్యతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని సభ్యులు ప్రియాంక, చక్కిలాల మోహన్‌రావు, కనకదుర్గ, శంకర్‌నాయక్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో, కనీసం జ్వరాల బారిన పడిన గ్రామాల్లోనైనా వైద్య శాఖ అప్రమత్తం చేసి వైద్య శిబిరాలను నిర్వహించాలని కోరారు. బనిగండ్ల పాడు పీహెచ్‌సీలో ఐదుగురు వైద్యులు ఉండాల్సి ఉన్నా ఒక్క డాక్టర్ కూడా లేరని ఇలాంటి విషమ పరిస్థితుల్లోనూ వైద్యులను ఏర్పాటు చేయకపోవడం పట్ల విస్మయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ మాట్లాడుతూ సభ్యులు కోరినట్లుగా గ్రామాల్లో పారిశుద్యాన్ని మెరుగుపరిచి డ్రైడే ఫ్రైడేలను నిర్వహించాలని కోరారు. కనీసం జ్వరాలు విజృంభిస్తున్న ప్రాంతాల్లోనైనా శిబిరాలను నిర్వహించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని ఆయన కోరారు. సుమారు గంట సేపు జరిగిన చర్చలో వైద్యశాఖ పనితీరుపై సభ్యులు కితాబునిచ్చారు. సమావేశం అనంతరం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ దంపతులతో సహా సభ్యులందరికీ ఆత్మీయ సత్కారం నిర్వహించారు. జడ్పీ సీఈవో వినోద్ ఆధ్వర్యంలో సిబ్బంది, ఉద్యోగుల ఆధ్వర్యంలో శాలువలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సభ్యులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ భారంగా వీడ్కోలు చెప్పుకున్నారు.

జడ్పీ చైర్మన్ 'కంచర్ల'కు ఆత్మీయ వీడ్కోలు

భద్రాద్రి కొత్తగూడెం జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావుకు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. రాబోయే రోజుల్లో ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ కంచర్ల మాట్లాడుతూ గడచిన 8 నెలల కాలంలో జడ్పీ చైర్మన్‌గా సేవలు అందించినందుకు ఆనందంగా ఉందని అన్నారు. చుంచుపల్లి జడ్పీటీసీగా 2019లో ఎంపికైన తనకు వైస్ చైర్మన్‌గా అవకాశం దక్కిందని, అనంతరకాలంలో చైర్మన్‌గా పని చేసే అవకాశం దక్కడం మరచిపోలేని మధుర జ్ఞాపకమని అన్నారు. భవిష్యత్తులో ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం వస్తే శిరసావహించి ప్రజా క్షేత్రంలో ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం చైర్మన్‌కు కార్యాలయ సిబ్బంది జ్ఞాపికను బహూకరించారు. కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఈవో చంద్రశేఖర్, కార్యాలయ సూపరింటెండెంట్‌లు కె.అరుణ, ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, మహ్మద్ నయీం, క్యాంపు క్లర్క్ వై.శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, రుక్మిణి, కళావతి, జగదాంబ, వాసు, రాజుగౌడ్, సుందర్‌లాల్, బోడ గణేష్, భూక్యా రాంబాబు, మధువన్ నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.



జడ్పీ అధికారులు, సిబ్బందితో 'కంచర్ల' గ్రూప్ ఫొటో



ఆర్అండ్‌బి స్పెషల్ సెక్రటరీ హరిచందనతో మంత్రి తుమ్మల

వడి వడిగా నేషనల్ హైవేలు

- గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలి
- హైదరాబాద్‌లో అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష

ఖమ్మం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిర్ణీత గడువులోగా ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణ పనులు పూర్తిచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. హైదరాబాదులో రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందనతో పాటు పలువురు అధికారులతో కలిసి సమీక్షించారు. విజయవాడ జాతీయ రహదారిపై ఖమ్మం నుంచి సూర్యాపేట ఎంట్రీవద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు సత్వరం పనులు ప్రారంభించాలని ఆదేశించారు. గతంలోనే ఈ పనులు మంజూరై టెండర్లు పూర్తయినందున పనులు ప్రారంభిచాలని కోరారు. తద్వారా ఖమ్మం-హైదరాబాదు వెళ్లే వాహనాలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని సూచించారు. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు ప్రగతిపై సమీక్షించారు. ధంసలాపురం వద్ద ఎగ్జిట్, ఎంట్రీపాయింట్‌కు అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని, దీనికి అనుగుణంగా నేషనల్ హైవేకు లేఖరాయాలని ఈ పనులు కూడా ప్రారంభయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అదేవిధంగా ధంసలాపురం ఎగ్జిట్, ఎంట్రీపాయింట్‌ల నుండి గ్రీనర్‌ఫీల్డ్ హైవే వెంట నూతన కలెక్టరేట్ వరు సర్వీసు రోడ్డు పూర్తిచేస్తే ఖమ్మంలో ట్రాఫిక్ నియంత్రణకు సౌలభ్యంగా ఉంటుందని, సూచించారు. సర్వీసు రోడ్లు కూడా సత్వరమే మంజూరుచేయాలని కోరారు. అలాగే ఉమ్మడి జిల్లాలో ఖమ్మం-కురవి, ఖమ్మం-కోదాడ రోడ్ల పురోగతిపై సమీక్షించారు. నెహ్రూనగర్-కొత్తగూడెం జాతీయ రహదారి గురించి మంత్రి తుమ్మల ప్రశ్నించగా ఇవి టెండర్ల దశలో ఉన్నాయని, అవి పూర్తికాగానే పనులు ప్రారంభిస్తామని నేషనల్ హైవే అధికారి హరిచందన తెలిపారు. చిల్లకల్లు నుండి వయా బోనకల్, వూబిరా, తల్లా, కొత్తగూడెం వరకు జాతీయ రహదారిగా అభివృద్ధి చేసేందుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపించామని త్వరలో ఈపనులు కూడా మంజూరవుతాయని మంత్రి తుమ్మల నేషనల్ హైవే అధికారులకు సూచించారు.



ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

- ప్రజలను గౌరవించనివారు ఇళ్లకే పరిమితమయ్యారు...
- కమ్యూనిస్టు కార్యాలయాలు పోరాట కేంద్రాలుగా ఉండాలి
- ప్రజాపోరాటాలకు కేంద్రంగా నిలిచిన కొత్తగూడెం
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- కొత్తగూడెం బాబుక్యాంపులో పార్టీ కార్యాలయం ప్రారంభం

అహంభావం పెరిగితే పతనం తప్పదు

6



పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలు

ఖమ్మం మామిళ్లగూడెం, ఆగస్టు 6: హర్‌ఘర్‌కి తిరంగా కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలు విక్రయిస్తున్నట్లు తపాలా సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి మంగళవారం తెలిపారు. రూ.25తో జాతీయ జెండా ఆన్‌లైన్‌లోనూ బుక్ చేసుకుని తీసుకునేందుకు ఈ-పోస్టాఫీస్ పోర్టల్‌లోనూ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 13 నుంచి 14వ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లా ప్రజలు సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు.

భద్రాద్రి దేవస్థానంలో
బదిలీల పర్వం


- ఏఈవో సహా ఐదుగురికి స్థాన చలనం
- వారి స్థానంలో వేములవాడ, యాదాద్రి నుంచి ఆరుగురు భద్రాద్రికి..
- న్యాయస్థానాన్ని ఆశ్రయించే యోచనలో ఉద్యోగులు?

వివరాలు : 6లో

జోరు వాన

- ఖమ్మం జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం
- తల్లాడలో అత్యధికంగా 12.8 సెం.మీ. వర్షపాతం
- పలుచోట్ల పొంగిన వాగులు
- వరి, పత్తి పొలాల్లో నిలిచిన వర్షపునీరు

ఖమ్మం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లాలో మంగళవారం పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండడంతో కొన్ని గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. జిల్లాలో సగటున 4.8సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తల్లాడ మండలంలో 12.8సెం.మీ, వైరాలో 8.09సెం.మీ, కల్లూరులో 7.2సెం.మీ, కొణిజర్లలో 7.8సెం.మీ, రఘునాథపాలెంలో 9.8సెం.మీ వర్షం కురిసింది. సింగరేణిలో 3.6సెం.మీ, కామేపల్లిలో 4.3సెం.మీ, ఖమ్మంరూరల్‌లో 3.0సెం.మీ, తిరుమలాయపాలెంలో 5.2సెం.మీ, కూసుమంచిలో 2.6సెం.మీ, నేలకొండపల్లిలో 2.1సెం.మీ, ముదిగొండలో 3.8సెం.మీ, చింతకానిలో 2.7సెం.మీ, ఖమ్మంఅర్బన్‌లో 2.8సెం.మీ, ఏన్కూరులో 4.4.సెం.మీ, పెనుబల్లి4.4.సెం.మీ, సత్తుపల్లి 3.2సెం.మీ, వేంసూరులో 5.6సెం.మీ, బోనకల్‌లో 1.1సెం.మీ, మధిర 3.5సెం.మీ, ఎర్రుపాలెం 2.8సెం.మీ వర్షపాతం నమోదైంది. (మిగతా 6వ పేజీలో)



తల్లాడ మండలంలో మాచవరం వాగు ఉధృతికి వంతెనపై పోటెత్తిన వరద

వైరా ఆయకట్టుకు నీరు విడుదల

6

సార్ యాదిలో..

- ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి
- నివాళులర్పించిన ఇరు జిల్లాల కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వీ పాటిల్
- తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన సేవలను కొనియాడిన కలెక్టర్లు




జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వీ పాటిల్

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం, అగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయాల సాధన కోసం కృషి చేయాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వీ పాటిల్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా కలెక్టర్ జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జయశంకర్ జీవిత చరిత్ర సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలను జిల్లా ఉన్నతాధికారులు స్మరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో జయశంకర్ పాత్ర మరువలేనిదని అన్నారు. 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, ఉద్యమానికి మార్గదర్శకంగా నిలిచి సలహాదారులుగా పని చేశారని, తెలంగాణ ఉద్యమానికి వెన్నెముకగా ఆచార్య జయశంకర్ నిలిచారని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ.ఓ. అరుణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగూడెం, (ఆంధ్రజ్యోతి): ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయాల సాధన కోసం అందరం కృషి చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ. పాటిల్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జయశంకర్ జీవిత చరిత్రకు సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలను మననం చేసుకున్నారు. స్వరాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసి మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సీపీఓ శ్రీనివాసరావు, ఎస్సీ సంక్షేమాధికారి అనసూయ, బీసీ సంక్షేమాధికారి ఇందిర, ఉద్యానశాఖ అధికారి సూర్యనారయణ, జిల్లా పరిపాలనాధికారి గన్యా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ప్రజల గుండెల్లో నిలిచిన వ్యక్తి జయశంకర్: ఏఎస్పీ

తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన వ్యక్తి ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ పరితోష్ పంకజ్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జయశంకర్ 90వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, కార్యాలయ ఏఓ జయరాజు, టౌటౌన్ సీఐ రమేష్, త్రీటౌన్ సీఐ శివప్రసాద్, ఎంటీఓ సుధాకర్, ఆర్ఐ ఆపరేషన్స్ రవి, ఆర్ఐ హోంగార్డ్స్ నరసింహారావు, అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాబు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకలితో అలమటిస్తున్నాం..

- వేతన బకాయిలు ఇప్పించండి
- ప్రజావాణి నోడల్ అధికారి దివ్యకు గిరిజన అవుట్‌సోర్సింగ్ కార్మికుల వినతి

భద్రాచలం, ఆగస్టు 6: 17 నెలలుగా వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నామని ఆకలితో అలమటిస్తున్నామని ఈ క్రమంలో వెంటనే మా వేతనాలు మాకు ఇప్పించండి అం టూ ప్రజావాణి నోడల్ అధికారి దేవరాజన్ దివ్యను గిరిజన సంక్షేమ శాఖ పోస్టు మెట్రిక్ హాస్టల్ అవుట్‌సోర్సింగ్ కార్మికులు అభ్యర్థించారు ఈ మేరకు హైదరాబాద్‌లో ఆమెను సీఐటీయూ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు, కార్యదర్శి కె.బ్రహ్మాచారిలు మాట్లాడుతూ గిరిజన కార్మికులు ఆకలిబాధలు ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు. జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. జీతాల కోసం ఎన్నిసార్లు అధికారులను కలిసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిపార్టుమెంటులో వేతనాల చెక్కులు పెండింగులో ఉన్నాయని వాటిని వెంటనే క్లియర్ చేసి జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుంజా జయ, బాదావత్ రాము, కట్రం తిరుపతమ్మ, లక్ష్మణ్, ఈసం పద్మ, స్వరూపం, లాలయ్య పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

- త్రీఫేస్ విద్యుత్ ఏర్పాటుకు కృషి
- ఐటీడీఏ పీవో రాహుల్
- బురదలో నడుచుకుంటూ వెళ్లి గిరిజనులతో మాట్లాడిన అధికారి




పొలాల పరిశీలనకు కాలినడకన వస్తున్న పీవో, గిరిజన రైతులతో మాట్లాడుతున్న పీవో రాహుల్

బూర్గంపాడు, ఆగస్టు 6: మారుమూల గిరిజన గ్రామాలకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం లేక పంటలు పండించుకోవాలంటే వర్షాధార పంటల పైనే ఆధారపడి పంటలు పండించుకుంటున్నామని విద్యుత్ సౌకర్యం కల్పిస్తే రెండు పంటలను పండించుకుని కుటుంబాలను పోషించుకుంటామని గోపాలపురం గిరిజనులు ఐటీడీఏ పీవో రాహుల్ దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం బూర్గంపాడు మండల పరిధిలోని గోపాలపురం గ్రామంలో రోడ్డు సౌకర్యం లేని పంట పొలాలను పీవో గ్రామం నుంచి మూడు కిలోమీటర్లు వరకు కాలినడకన వెళ్లి పరిశీలించారు. ముందుగా గిరిజనుల పంట పొలాలకు కరెంటు సౌకర్యం కల్పించడానికి ఏం ఆటంకాలు ఉన్నాయని ఫారెస్ట్ ఆధికారులను, గిరిజన రైతులను అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల పంట పొలాలకు కరెంటు లైన్ వేయాలంటే కొంత ఫారెస్ట్ భూమి ఆటంకంగా ఉందని కరెంటు లైన్ ఏర్పాటు చేయడానికి 50స్తంభాలు వేయవలసి ఉంటుందని అందుకు ఫారెస్ట్ అధికారులు అభ్యంతరం తెలుపుతున్నారని విద్యుత్ శాఖ అధికారులు, రైతులు పీవో దృష్టికి తీసుకొచ్చారు. ఫారెస్ట్‌కు దగ్గరగా ఉన్న భూములకు విద్యుత్ సరాపరా ఇస్తే అడవి జంతువులకు హాని కలగవచ్చని, ఎందుకంటే పంట పొలాలను అడవి పందులు, గేదెలు, ఇతర జంతువులు నాశనం చేస్తాయని పొలాల చుట్టూ కరెంటు తీగలతో కంచె అమర్చే అవకాశం ఉందని అందుకే కరెంటు లైన్ ఏర్పాటుకు మొగ్గు చూపడం లేదని ఫారెస్ట్ ఆధికారులు తెలిపారు. ఇరువురు వాదనలు విన్న తర్వాత ఫారెస్ట్‌కు ఆటంకం కలగకుండా గిరిజన రైతులకు కరెంటు సౌకర్యం కల్పిస్తే మోటర్లు బిగించుకుని రెండు పంటలు పండించుకుంటారని అందుకు ఎవరికి నష్టం కలుగకుండా ప్రతిపాదనలు తయారు చేయాలని అటవీ అధికారులకు సూచించారు. పోడు పట్టా ఉన్న గిరిజన రైతులకు మాత్రమే కరెంటు సౌకర్యం కల్పించాలని గిరిజనేతరులు ఎవరైనా ఉంటే వారికి కరెంటు సౌకర్యం కల్పించడం జరగదని అన్నారు. గిరిజన రైతులు ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి పెట్టి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు వచ్చే పంటలను వేసుకోవాలని పామ్ ఆయిల్ పంటలు, పండ్లతోటలు, మునగ చెట్లు, చేపల చెరువులు ఏర్పాటు చేసుకోని అధిక రాబడి సంపాదించుకునే విదంగా రైతులు సమష్టి కృషితో వ్యవసాయం చేసుకోవాలన్నారు. అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న గిరిజన గ్రామాలలోని గిరిజనులు అటవీ ఫలాలను ముఖ్యంగా ఇప్పపువ్వు సేకరణ లాంటివి సేకరిస్తే ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేసి గిరిజనులకు ఆర్థికంగా వెసులుబాటు కల్పిస్తామని, చదువుకున్న గిరిజన యువత ఆసక్తితో ముందుకు వస్తే ఇప్పపువ్వు ద్వారా నూనె తీసే యంత్రం యూనిట్‌ను సబ్సిడి ద్వారా అందిస్తామని అన్నారు ఫారెస్ట్ అధికారులతో సంప్రదించి ఎవరికి ఇబ్బందులు కలగకుండా కరెంటు లైన్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని రైతులకు హమీ ఇచ్చారు. కార్యక్రమంలో డీటీ ఆర్‌వోఎఫ్ఆర్ శ్రీనివాస్, ఏపీవో పవర్ ముస్సీర్ పాషా, ఎఫ్ఆర్ఓ సురేష్, పంచాయతీ కార్యదర్శి రుక్మిణి, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, లైన్‌మెన్ శోభన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం బహిరంగ సభాస్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే, అధికారులు



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, అధికారులు

వైరా, ఆగస్టు 6: ఈనెల 15న వైరాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే రైతు బహిరంగ స్థల పరిశీలనను ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పలువురు జిల్లా అధికారులు మంగళవారం పరిశీలించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఖమ్మం సీపీ సునీల్‌దత్, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సోమవారం సీఎం సభకు అవసరమైన స్థలాన్ని పరిశీలించి ఓకే చేశారు. ఆవెంటనే కలెక్టర్ ఆదేశాలతో సంబంధిత శాఖలు స్థలంలో ఏర్పాట్లు చేపట్టారు. మంగళవారం తెల్లవారుజామున కురిసి భారీవర్షంతో స్థలమంతా బురదగా మారడంతో పనులు నిల్చిపోయాయి. అయితే కలెక్టర్ ఆదేశాలతో జిల్లా అదనపు కలెక్టర్ మదుసూదన్‌నాయక్, ఖమ్మం ఆర్డీవో గణేశ్, అడిషనల్ డీసీపీ ప్రసాదరావు, పలుశాఖల అధికారులు వైరా చేరుకొని ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడితో కలిసి స్థలాన్ని పరిశీలించారు. సీఎం పాల్గొనే బహిరంగ సభ వేదిక కోసం సమీపంలోని పలువురు రైతులు పెసర సాగుచేసిన భూములు అవసరం కావడంతో ఎమ్మెల్యే చొరవ తీసుకొని రైతులను తమ భూములు ఇచ్చేందుకు ఒప్పించారు. నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించేందుకుగానూ వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఏసీపీ ఎంఏ.రెహ్మాన్, సీఐ ఎన్.సాగర్, ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్, వైరా ఏవో ఎస్.పవన్‌కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, నాయకులు చప్పిడి వెంకటేశ్వరరావు, మట్టూరి కృష్ణారావు, పమ్మి అశోక్ పాల్గొన్నారు.

మాఫీ అయిన రైతులకు మళ్లీ రుణాలు

- కొత్తగూడెం సొసైటీలో రూ.3.50 కోట్ల రుణమాఫీ
- ఎమ్మెల్యే కూనంనేని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి, ఆగస్టు 6: కొత్తగూడెం సహకార సంఘం పరిధిలో రూ.3.50 కోట్ల నిధులు తొలి విడత రుణమాఫీ పంపిణీ చేసినట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. మంగళవారం మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని కొత్తగూడెం సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ మండె వీరహన్మంతరావు అధ్యక్షతన రుణమాఫీ పథకం కింద మాఫీ అయిన రైతులకు తిరిగి నూతన పంట రుణాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రుణమాఫీ అయిన లబ్దిదారులకు నూతన పంట రుణాలకు సంబంధించిన చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ పథకాన్ని రెండు విడతలుగా అందజేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ రెండు విడతలలో రుణమాఫీ నిధులు రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేయడంపై ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ తిరిగి పంట రుణాలను అందజేస్తామన్నారు. కొత్తగూడెం సహకార సంఘంలో మొత్తం 902 మంది రైతులకు గాను రూ.3.50 కోట్లు రుణమాఫీ పథకం కింద రైతులకు రుణమాఫీ అయిందన్నారు. వాణిజ్య బ్యాంకులకు ధీటుగా సహకార బ్యాంకులలో క్రెడిట్ పరిమితి ప్రకారం నిధులు ఇవ్వాలని అప్పుడే సహకార సంఘాల మనుగడ సాధ్యమౌతుందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, రాష్ట్ర రైతు సంఘం ఉపధ్యక్షులు కాసాని అయిలయ్య, టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు, సహకార సంఘం ఉపాధ్యక్షుడు కూచిపుడి జగన్నాధరావు, బ్యాంకు మేనేజర్ శాంతిరాఘమయి, సొసైటీ డైరెక్టర్లు అమృతరావు, చందర్, విజయకుమారి, వెంకటేశ్వరరావు, రాంచందర్‌రావు, మాజీ రైతు కన్వీనర్ మోహన్‌రావు, మేజమెట్ల బాబూరావు, శేషభూషన్, రుణ మాఫీ లబ్దిదారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జోరు వాన

(5వ పేజీ తరువాయి)

భారీవర్షాల కారణంగా కొణిజర్ల మండలంలోని పల్లిపాడు-ఏన్కూరు రహదారిలో వాగులు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఖమ్మం నుంచి కొత్తగూడెం వెళ్లే వాహనాలు తల్లాడ మీదుగా వెళుతున్నాయి. కొణిజర్ల-మల్లుపల్లి గ్రామాల మధ్య వాగులు పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తుమ్మలపల్లి అన్నవరం వాగు పొంగడంతో ఈ గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. తల్లాడ మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మాచవరం వాగు పొంగడంతో బిల్లుపాడు-కొత్త వెంకటగిరి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. బిల్లుపాడు-రామచంద్రాపురం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. కట్టలేరు వాగు పొంగడంతో పినపాక, వెంకటాపురం గ్రామాలకు రాకపోకలకు నిలిచిపోయాయి. కేశ్వాపురం-వెంకటాపురం, గంగదేవిపాడువాగు పొంగడంతో నూతన్‌కల్, గూడూరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షంతో తల్లాడలో ఇళ్ల మధ్య వరద నీరు చేరింది. ఖమ్మంలోని మున్నేరు చెక్‌డ్యాం వద్ద పొంగి ప్రవహిస్తోంది. జిల్లాలో కురిసిన వర్షాల కారణంగా వాగులు పొంగిన ప్రాంతాలలో వరి, పత్తి చేలల్లో నీరు చేరింది. వైరా రిజర్వాయర్‌కు నీరు చేరడంతో సాగునీటి అవసరాల కోసం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ నీరు విడుదల చేశారు.

వరద బాధితులకు నేనుసైతం..

రూ. 4500లను కేరళ మాజీ ఎంపీకి అందించిన చిన్నారి జాన్విక



మాజీ ఎంపీ విజయ్‌రాఘవన్‌కు నగదు అందజేస్తున్న చిన్నారి

కొణిజర్ల, ఆగస్టు 6: కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధిత కుటుంబాలకు తన సహాయార్థం కొణిజర్ల మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన సీపీఎం జిల్లా నాయకులు తాళ్లపల్లి కృష్ణ మనుమరాలు, సాయికుమార్ కూతురు జాన్విక తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.4500 లను కేరళ మాజీ ఎంపీ విజయ్‌రాఘవన్‌కు అందించారు. సోమవారం ఆయన కొత్తగూడెం వచ్చిన సందర్భంగా పార్టీ సమావేశం అనంతరం రాత్రిపూట తాళ్లపల్లి క్రిష్ణ, సాయికుమార్ ఆధ్వర్యంలో జాన్విక చేతులు మీదగా అందజేశారు. చిన్నారి సహృదయానికి విజయ్‌రాఘవన్ ఫిదా అయ్యారు. చిన్నతనం నుంచే మంచి గుణాన్ని అందిస్తున్నారని కుటుంబసభ్యులను అభినందించారు.

భద్రాద్రి దేవస్థానంలో బదిలీల పర్వం

భద్రాచలం, ఆగస్టు 6: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఐదుగురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఈ మేరకు దేవస్థానం అధికారులకు సోమవారం అర్ధరాత్రి ఉత్తర్వులు అందాయి. స్థానచలనం కలిగినవారిలో భద్రాచలం దేవస్థానం ఏఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న భవానీ రామకృష్ణారావు, సూపరింటెండెంట్ నిరంజన్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ పి.రామచంద్రశేఖర్‌లకు యాదగిరిగుట్ట దేవస్థానానికి బదిలీ అయ్యింది. అలాగే శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.రామారావు బాసర దేవస్థానానికి, జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణల వేములవాడ దేవస్థానానికి బదిలీ అయ్యారు. బదిలీ అయినవారి స్థానంలో వేములవాడ దేవస్థానంలో ఏఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న హరికిషన్, సూపరింటెడెంట్ అరుణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ బి.శివరాం భద్రాచలం రానున్నారు. అలాగే యాదగిరిగుట్ట నుంచి సీనియర్ అసిస్టెంట్లు కృష్ణస్వామి, బాలాజీ, జూనియర్ అసిస్టెంట్ ఆగారెడ్డి రానున్నారు.

చివరి నిమిషం వరకు ఉత్కంఠే

రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం బదిలీల ప్రక్రియ నిర్వహించగా దేవాదాయశాఖ ఉద్యోగులకు చివరి నిమిషంలో బదిలీలు జరిగాయి. సుమారు 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తరువాత దేవస్థానం ఉద్యోగులకు బదిలీ వ చ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దేవస్థానాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. భద్రాద్రి దేవస్థానం నుం చి ఎవరు బదిలీ అవుతారనే విషయంపై ఉద్యోగవర్గాల్లో చివరివరకు ఉత్కంఠ నెలకొంది. ఎట్టకేలకు సోమవారం అర్ధరాత్రి అధికారికంగా బదిలీ ఉత్తర్వులు రావడంతో ఉత్కంఠకు తెరపడింది.

న్యాయస్థానాన్ని ఆశ్రయించే యోచనలో ఉద్యోగులు ?

దేవాదాయశాఖలో జరిగిన బదిలీల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కొంతమంది ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. భద్రాద్రి దేవస్థానానికి బదిలీ అయిన వారిలో ఒకరు ఇక్కడకు వచ్చేందుకు సుముఖంగా లేరనే ప్రచారం జరుగుతోంది. అంతే కాకుండా విద్యా సంవత్సరం ప్రారంభమైన తరువాత బదిలీలు జరిగాయనే కారణంతో ఇతర దేవస్థానాలకు చెందిన కొందరు ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్ర యించే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా భద్రాద్రి దేవస్థానం నుంచి బదిలీ అయిన ఉద్యోగుల స్థానంలో కొత్తవారు వస్తేనే ఇక్కడివారిని రిలీవ్ చేసే అవకా శం ఉన్నట్లు సమాచారం. దీనిపై దేవస్థానం అధికార ఉద్యోగ వర్గాలు మౌనం వహిస్తున్నాయి.

విద్యుత్ షాక్‌తో గ్రానైట్ కార్మికుడి మృతి

ఖమ్మం రూరల్, ఆగస్టు 6: విద్యుత్ షాక్‌తో గ్రానైట్ కార్మికుడు మృతిచెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్ రాష్ట్ర జవారా జిల్లాకి చెందిన జగదీష్‌సింగ్ (48) కొంతకాలంగా మండల పరిధిలో ఆరెంపులలోని ఓ గ్రానైట్ పరిశ్రమలో మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. పరిశ్రమలో విద్యుత్తు మోటారు మరమ్మతులకు గురి కావడంతో ఆ విద్యుత్తు మోటర్‌కు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని వెంటనే చికిత్స కోసం తోటి కార్మికులు ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. సంఘటనపై మృతుని బంధువు ప్రేమ్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

అహంభావం పెరిగితే

పతనం తప్పదు



జెండా ఆవిష్కరిస్తున్న నారాయణ

కొత్తగూడెం, అగస్టు 6: తెలుగు రాష్ట్రాల్లో ప్రజలను, ప్రతిపక్షాలను గౌరవించనివారు ఇళ్లకే పరిమితమయ్యారని సీపీఐ జాతీయ కార్యదర్శి డా. కె. నారాయణ పేర్కొన్నారు. అవినీతి, రౌడీయిజం, అహంభావం పెరిగితే ఎవరికైనా పతనం తప్పదన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం బాబుక్యాంపులో మంగళవారం సీపీఐ కార్యాలయం (రజబ్‌అలీ భవన్) ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన సీపీఐ జెండాను ఎగురవేశారు. అనంతరం రజబ్‌అలీ భవన్ కార్యదర్శి కార్యాలయాన్ని సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, చంద్ర సత్యం, సమావేశ మందిరాన్ని ఏఐటీయూసీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ కమ్యూనిస్టు కార్యాలయాలు పోరాట కేంద్రాలుగా విలసిల్లాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డా. కె. నారాయణ ఆకాంక్షించారు.

రజబ్‌అలీ కాలం నాటి రాజకీయాలకు, నేటి రాజకీయాలకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. దేశంలో మోదీ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు తెరలేపారన్నారు. తమకు ఎదురే లేదని ప్రజలను, ప్రతిపక్షాలను గౌరవించకుండా తూలనాడిన జగన్, కేజీఆర్‌లను ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారని గుర్తు చేశారు. ప్రతిపక్షలను అగౌరవ పరిచే సంప్రదాయాన్ని మానుకోవాలన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తప్పిదాన్ని చేస్తోందని, తన తీరు మార్చుకోవాలని సూచించారు. కొత్తగూడెం జిల్లా ప్రజాపోరాటాలకు వేదికగా నిలిచిందన్నారు.

అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సుమారు 40ఏళ్ల నుంచి ఈ ప్రాంతం కమ్యూనిస్టుల కంచుకోటని, తాను కొత్తగూడెం వచ్చిన తొలినాళ్ల నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాంత ప్రజలు కమ్యూనిస్టు పార్టీకి అండదండగా ఉన్నారన్నారు. ఎన్నో పోరాటాలు, నిర్బంధాలు, జైళ్లు, అణిచివేతలను తట్టుకుని నిలబడ్డామని, మొదట్లో ఈ కార్యాలయాన్ని రేకుల షెడ్డులో ఏర్పాటు చేసుకుని ఇప్పుడు సరికొత్త హంగులతో నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం ఎంతో సంతోషాన్ని, భావోద్వేగాన్ని కలిగిస్తోందన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలోని ప్రతి అభివృద్ధి పనిలో సీపీఐ కృషి ఉందన్నారు. ఇప్పుడు మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం లభించిందన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ భద్రాద్రి, ఖమ్మం జిల్లాల కార్యదర్శులు సాబీర్‌పాషా, పోటు ప్రసాద్, వర్కర్స్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతరామయ్య, రాజ్‌కుమార్, మాధవరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, నరాటి ప్రసాద్, వెంకన్న, మురళి, పూర్ణచంద్రరావు, సాయిబాబు, కేశవరావు, జమలయ్య, బండి నాగేశ్వరరావు, విజయలక్ష్మి, వివిధ పార్టీల నాయకులు చౌదరి, నాగసీతరాములు, అనంత రాములు, పౌలు, పూసపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైరా ఆయకట్టుకు నీటి విడుదల

- రెండు పంటలకు సాగునీరు: ఎమ్మెల్యే రాందాస్‌నాయక్
- నిండుకుండలా మారిన రిజర్వాయర్



నీళ్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

వైరా, ఆగస్టు 6: ఈ ఏడాది నుంచి వైరా రిజర్వాయర్ ఆయకట్టులో రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు సరఫరా చేస్తామని స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రకటించారు. వైరా రిజర్వాయర్ కుడి కాల్వ హెడ్‌స్లూయిస్ లాకులు ఎత్తి ఆయకట్టులో ఖరీఫ్ వ్యవసాయానికి నీటిని మంగళవారం అధికారులు, నాయకులు, రైతులతో కలిసి విడుదల చేశారు. లాకులు ఎత్తేముందు పూజలు చేశారు. నీటివిడుదల తర్వాత కాల్వలో ప్రవహించిన నీటికి హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో మునుపెన్నడూ లేని విధంగా సకాలంలో ఎన్నెస్పీ నిండిందని, గోదావరి పొంగి ప్రవహిస్తుందని అందువలన సాగునీటికి కొరతే లేదని వ్యాఖ్యానించారు. వైరాకు అవసరాన్ని బట్టి కృష్ణా, గోదావరి జలాలు పుష్కలంగా వస్తాయని రైతులు సమృద్ధిగా రెండు పంటలు సాగుచేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి గోదావరి జలాలను ఖమ్మంజిల్లాకు విడుదల చేసి వైరాలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని దీన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, పీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, మండల, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, నీటిపారుదలశాఖ ఈఈ బాబూరావు, డీఈఈ పి.శ్రీనివాస్, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, మాస్‌లైన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నిండుకుండలా రిజర్వాయర్

వైరా రిజర్వాయర్‌కు భారీగా వరదనీరు వచ్చిచేరుతోంది. మంగళవారం సాయంత్రానికి నీటిమట్టం 16అడుగులకు చేరింది. మంగళవారం తెల్లవారుజామున రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియా అయిన ఏన్కూరు, కామేపల్లి, కొణిజర్ల పలు ప్రాంతాల్లో కుంభవృష్టిగా కురిసిన భారీ వర్షంతో నిమ్మవాగు, పగిడేరు నుంచి భారీగా రిజర్వాయర్‌కు వరదనీరు వచ్చింది. సోమవారం సాయంత్రానికి 12.6అడుగులుగా ఉన్న నీటిమట్టం కేవలం ఒక్కరోజులోనే 16అడుగులకు చేరుకుంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3 అడుగులుగా ఉంది. ఇంకా 2.3అడు గుల నీరు వచ్చిచేరితే పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటుంది. వైరాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మొదలైన తర్వాత అత్యధిక వర్షం 89.20మిల్లీమీటర్లు నమోదైంది.

డబ్బులిస్తేనే శవాన్ని తీసుకువెళ్తానన్నాడు..

- మణుగూరు మునిసిపాలిటీ డ్రైవర్ అమానీయ ప్రవర్తన
- స్వయంగా మోసుకువెళ్లిన కుటుంబసభ్యులు



వర్షంలో మృతదేహాన్ని తీసుకెళుతున్న కుటుంబసభ్యులు

మణుగూరు, ఆగస్టు 6: మణుగూరు మండలం రామానుజపురం పంచాయతీలోని అయోధ్య నగర్‌లో మంగళవారం ఓ అమానవీయ ఘటన చోటుచేసుకుంది. స్థానికంగా నివాసముండే రాసమళ్ల సంధ్యారాణి (38)అనే దివ్యాంగురాలు అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందింది. ఈమెకు వివాహం కాలేదు. శ్మశాన వాటిక దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో పెద్దిప ల్లి అనే గ్రామ శివారులో ఉండటంతో కుటుంబ సభ్యులు అంతిమ యాత్ర వాహనం కోసం మణుగూ రు మునిసిపాలిటీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. అధికారుల ఆదేశాల మేరకు వాహనం తీసుకొని అయోధ్యనగర్‌కు బయలుదేరిన డ్రైవర్.. మృతురాలి ఇంటి వద్దకు రాకుండా ప్రధాన రహదారిపైనే వాహనం ఆపి డీజిల్‌కు రూ.500, తనకు రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అయితే తాము నిరుపేదలమని, డబ్బులు ఇచ్చుకోలేమని చెప్పినా డ్రైవర్ వినలేదు. దీంతో మృతురాలి కుటుంబసభ్యులు శవాన్ని మోసుకొని వర్షంలోనే శ్మశాన వాటికకు తీసుకువెళ్లి అంత్యక్రియలు పూర్తి చేశారు. శవాన్ని తీసుకువెళ్లకుండా అమానవీయంగా వ్యవహరించడమే కాకుండా, తాను ఇంత దూరం వచ్చినందుకు రూ.200 ఇవ్వాలని డ్రైవర్ డిమాండ్ చేసినట్టు మృతురాలి సోదరుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై మణుగూరు మునిసిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావును వివరణ కోరగా డ్రైవర్ వ్యవహరించిన తీరుపై విచారణ చేపడతామని తెలిపారు.

మంచం పట్టిన ఏజెన్సీ పల్లెలు..


జూలూరుపాడు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన జ్వరపీడితులు(ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రబలుతున్న విషజ్వరాలు, అంటువ్యాధులు

- కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు
- పంచాయతీల్లో పడకేసిన పారిశుధ్యం
- ఆందోళనలో సామాన్య ప్రజానీకం

కొత్తగూడెం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీజనల్ అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి.. ఏజెన్సీ మారుమూలు గ్రామాల్లో జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. జిల్లాలో పలు గ్రామపంచాయతీలో పారిశుధ్యం పడకేసిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణాల్లో సైతం పారిశుధ్య నిర్వహణ పనులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో ఎక్కడి పారిశుధ్యం అక్కడే ఉండటంతో ఒక పక్క వర్షాకాలం సీజన్ కావడం పరిసరాల పరిశుభ్రత సక్రమంగా లేకపోవడంతో జ్వరాల భారీన పడి జనం అల్లాడిపోతున్నారు.

భద్రాద్రి ఏజెన్సీ మారుమూల గ్రామాల్లో సైతం జ్వరాలతో మరింతగా విజృంభిస్తున్నాయి. మలేరియా, చికెన్‌గున్యా, డెంగ్యూ తదితర వైరల్ జ్వరాలు, అంటు వ్యాధులతో అయా ప్రాంతాలు అట్టుడికిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వైద్య సౌకర్యాలు సక్రమంగా లేకపోవడం, వారి వద్ద ఆర్థిక పరిస్థితులు ఇబ్బందులుగా ఉండటం, వైద్య చికిత్సలు చేయించుకోలేకపోవడంతో జ్వరాల బారిన పడి పలు ఇబ్బందులు పడుతున్నారు. ఒళ్లు నొప్పులతో మొదలై శరీరమంతా కదలలేకుండా కీళ్లనొప్పులు, చేతుల నొప్పులు తదితర నొప్పులుగా మారి జ్వరాలతో ప్రజలు అధికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పలు మండలాల్లో, పలు ప్రాంతాల్లో డెంగ్యూ బారిన పడి ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి వైద్య చికిత్సలను జరిపించుకుంటున్నారు. డెంగ్యూ సోకిన వారికి ప్లేట్‌లెట్స్ పడిపోవడం, నీరసంగా ఉండటం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి చికిత్సలు చేయించుకుంటున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే డెంగ్యూ జ్వరాల నిర్ధారణ వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడే డెంగ్యూ కిట్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ వైద్యశాలకు మాత్రమే వెళ్లి ఆ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తద్వారా అక్కడ వ్యాధి నిర్ధారణ అనంతరం, ఆర్థిక పరిస్థితులు ఉన్న ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి చికిత్సలు తీయించుకుంటున్నారు. మామూలు జ్వరాలైతే ప్రతి ఇంట్లో దర్శనమిస్తున్నాయి. దోమకాటు వల్ల మరింత జ్వరాలు ఉధ్రుతంగా పెరిగిపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షా లతో పేరుకుపోయిన పారిశుధ్యాన్ని గ్రామపంచాయతీల్లో సిబ్బంది సక్రమంగా చేయకపోవడంతో పారిశుధ్య పరిస్థితులు మరింత అధ్వానంగా ఉన్నాయి.

ఆదేశాలతో సరి...

ఒక పక్కన జిల్లా అధికారులు పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ సిబ్బంది నామమాత్రంగా పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టడం వల్ల కూడా అంటు వ్యాధులు సోకుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మునిసిపాలిటి పరిధిలో కూడా పారిశుధ్య నిర్వహణ చర్యలు నామమాత్రంగానే జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు, భద్రాచ లం, అశ్వారావుపేటలలో పారిశుధ్య నిర్వహణ చర్యలు సక్రమంగా లేవని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని మారుమూల ఏజెన్సీ గ్రామపంచాయతీల్లో కూడా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరదలు విపరీతంగా రావడం, వాగులు, వంకలు పొంగి ప్రవహించడం, మురుగు కాల్వలో వర్షపు నీరు నిలిచిపోవడంతో అంటు వ్యాధులు మరింత ప్రభలుతున్నాయి.

ఏజెన్సీలోని చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, పినపాక, కరకగూడెం, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, చంద్రుగొండ, జూలూరుపాడు, సుజాతనగర్, పాల్వంచ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లి, ఆళ్లపల్లి, ఇల్లెందు తదితర మండలాల్లోని పలు గ్రామపంచాయతీల్లో ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో పారిశుధ్య చర్యలు సక్రమంగా లేకపోవడంతో అయా ప్రాంతాల్లో సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్నాయని సమాచారం. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై అయా మండలాల్లోని మారుమూల గ్రామపంచాయతీల్లోని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ చర్యలు సక్రమంగా చేపట్టి బ్లీచింగ్, క్లోరినేషన్ తదితర వాటిని చల్లి వ్యాధులు ప్రభలకుండ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తగినచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దళితబంధు పథకం యూనిట్ల పరిశీలన చేపట్టాలి

● కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 6: చింతకాని మండలంలో మంజూరైన దళిత బంధు పథక యూనిట్ల పరిశీలన ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చింతకాని మండల గ్రామ దళిత బంధు ప్రత్యేక అధికారులతో దళిత బంధు యూనిట్ల పరిశీలనపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతకాని మండలంలో స్యాచురేషన్ మోడ్‌లో దళితబంధు పథకాన్ని అమలు చేశారన్నారు. మండలంలోని 25 గ్రామాల్లో 3,462 మంది లబ్ధిదారులను గుర్తించగా, 1,888 మంది లబ్ధిదారులకు దళితబంధు సంపూర్ణ లబ్ధిని అందించగా, మిగతా 1,574 మంది లబ్ధిదారులకు మొదటి దఫా యూనిట్ల మొత్తం మంజూరు చేయడం జరిగిందన్నారు. దళితబంధు గ్రామ ప్రత్యేక అధికారులు మొదటి యూనిట్ మొత్తం మంజూరు చేసిన లబ్ధిదారులకు సంబంధించి యూనిట్లు, వారి స్థితిగతుల గురించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. యూనిట్లు గ్రౌండింగ్ అయి, సక్సెస్‌గా రన్ అవుతూ, రెండో విడత మంజూరుకు ఎదురు చూస్తున్నవి, కొత్త యూనిట్ మంజూరు కోసం ఎంత ఆవశ్యకత ఉన్నది విచారణ చేయాలన్నారు. రెండో దశలో యూనిట్లు మంజూరై, కొంత కాలం నడిచి మరమ్మతులకు అయినవి గుర్తించి, ఆ యూనిట్ల విషయమై డీఆర్డీఏ ఏపీఎంల సహకారంతో విచారణ చేపట్టి కారణాలు తెలుసుకొని, రిహాబిలిటేషన్‌కు చర్యలు తీసుకోవాలని అన్నారు. మూడో దశలో దారి మళ్లిన యూనిట్లు గుర్తించాలన్నారు. క్షేత్రస్థాయి ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి, సమగ్ర నివేదికను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, ఎస్సీ కార్పొరేషన్ సహాయ ఎగ్జిక్యూటివ్ సంచాలకులు నవీన్ బాబు, దళితబంధు చింతకాని మండల గ్రామ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి: డీఎంహెచ్‌వో


వెంకటాపురంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

కరకగూడెం, ఆగస్టు 6: మారుమూల గ్రామాల్లోని ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని భద్రాద్రి జిల్లా డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ వైద్యశాలను డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని మందుల గదిని, రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది వివరాలను వైద్యాధికారి మధును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకటాపురం, దేవరనాగరం గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది జ్వర పీడితులను గుర్తించి, రక్త పూతలు సేకరించాలన్నారు. వైద్య సిబ్బంది ఉదయం 9గంటలకు తప్పక వైద్యశాలలో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఈ కృష్ణయ్య, వైద్యాధికారి మధు, సిబ్బంది నరసింహారావు, కృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

పినపాక: వానాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి భాస్కర్‌నాయక్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రిలోని సమస్యల గురించి పినపాక మెడికల్ ఆఫీసర్ దుర్గా భవానిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సింగరేణిలో 9 మంది అధికారుల బదిలీ

ఆంధ్రజ్యోతి కొత్తగూడెం అగస్టు6: సింగరేణి సంస్థలో తొమ్మిది మంది అధికారులను బదిలీచేస్తూ జీఎం పర్సనల్ అండ్ సీ.ఎస్.ఆర్ కార్యాలయం మంగళవారం అధికారికంగా ఉత్తర్వులను జారీ చేసింది. బదిలీ అయినవారిలో కార్పోరెట్ ఆర్ అండ్‌డీ జీఎంగా విధులు నిర్వహిస్తున్న ఎమ్.సుభానీ హైదరాబాద్(సీ.డీ.ఎస్)కు, భూపాలపల్లిలో జీఎంగా విధుల్లో ఉన్న డి.రవిప్రసాద్ హైదరాబాద్(మార్కెటింగ్)జీఎంకు, మందమర్రిలో జీఎంగా విధుల్లో ఉన్న ఏ.మనోహర్ ఎన్విరాన్మెంట్)జీఎంకు, రామగుండం ఆర్.జీ-1 జీఎంగా విధుల్లో ఉన్న సీహెచ్ శ్రీనివాస్, జీఎం(సేఫ్టీ) కార్పోరేట్‌కు, హైదరాబాద్ మార్కెటింగ్ జీఎంగా విధుల్లో ఉన్న జి.దేవేందర్ మందమర్రి జీఎంకు, కార్పోరేట్ (బీ.డీ) జీఎంగా విధుల్లో ఉన్న సుశాంత్ షా, కొత్తగూడెం రిజీయన్ (కూ.ఎమ్)కు, మణుగూరు జీఎంగా విధుల్లో ఉన్న డి.లలిత్‌కుమార్ రామగుండం ఆర్.జి-1 జీఎంకు, రామగుండం ఆర్.జి-1 జీడీకే 1గ్రూప్ ఏజెంట్‌గా విధుల్లో ఉన్న బాణోతు సైదులు కార్పొరేట్ (ఆర్.డీ)జీఎంకు, శ్రీరామ్‌పూర్ ఏరియా ఐ.కె గ్రూప్ ఏజెంట్ ఎమ్.శ్రీనివాస్, భూపాలపల్లి జీఎంకు బదిలీ అయ్యారు. తక్షణమే తమ శాఖలకు రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

వరంగల్‌లో జరిగే ఎల్ఐసీ సమావేశాన్ని విజయవంతం చేయాలి

● వరంగల్ డివిజన్ అధ్యక్షుడు వైవీ. కృష్ణారావు

ఖమ్మంటౌన్, ఆగస్టు6: వచ్చేనెలలో వరంగల్ జరిగే ఎల్ఐసీ (లియాఫీ 1964) ఏజెంట్ల జనరల్‌బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని వరంగల్ డివిజన్ అధ్యక్షుడు వైవీ. కృష్ణారావు కోరారు. మంగళవారం వరంగల్ డివిజన్ లియాఫీ నాయకులు ఎల్ఐసీ ఖమ్మం బ్రాంచ్‌ను సందర్శించి, ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ డివిజన్ పరిధిలోని ఏజెంట్ల జనరల్‌బాడీ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో వరంగల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి డీ.గోపాలరావు, కోశాధికారి బెల్లంకొండ శ్రీనివాస్, జోనల్ నాయకులు మోహన్‌రావు, సత్యనారాయణ, ఖమ్మం బ్రాంచ్ అధ్యక్షుడు లక్ష్మణ్‌రా వు, ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు, గౌరవ అధ్యక్షుడు ఎం.రమేష్ బాబు, చలపతిరావు, ఏజెంట్లు పాల్గొన్నారు.

ఆటో చోరీపై కేసు నమోదు

ఖమ్మం క్రైం, ఆగస్టు6: గుర్తు తెలియని వ్యక్తి ఆటోచోరీ చేసిన ఘటనపై ఖమ్మం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ నందు మంగళవారం కేసు నమోదైంది. గుదిమళ్ల ప్రాంతానికి చెందిన ఉపేందర్ అనే వ్యక్తి ఆటో నడుపుతూ నగరంలోని పలు ఇండ్లలో పాలుపోస్తూ ఉంటాడు. మంగళవారం ఉందయం నగరంలోని పంపింగ్‌వెల్ రోడ్ లోని ఓ ఇంట్లో పాలు పోసేందుకు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తి మొహానికి క్లాత్ కట్టుకొని వచ్చి, ఆటోను దొంగలించి పారిపోయాడు. దీంతో బాధితుడు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

వరంగల్ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్


పాల్వంచలో ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న షాహిద్ మసూద్

పాల్వంచ టౌన్, అగస్టు 6: పట్టణ పరిధిలోని 300 గజాల స్థలంలో నిర్మాణం చేసిన, చేస్తున్నటువంటి భవనాలలో విధిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని మునిసిపల్ ఆర్‌డీ (వరంగల్) షాహిద్ మసూద్ అన్నారు. మంగళవారం పాల్వంచ మునిసిపాలిటీని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లోని భవన నిర్మాణాల్లో సిబ్బందితో కలసి ఇంకుడు గుంతలను పరిశీలించారు. అదే విధంగా కరకవాగులోని ఫిల్టర్‌బెడ్‌లోని నీటి శుభ్రత, బొల్లోరిగూడెంలోని వాటర్‌ట్యాంకులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ డాకూ నాయక్, డీఈ స్వరూపరాణి, టీపీవో సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, పర్యావరణ ఇంజనీర్ ఫరీద్, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో చోరీ

రూ.50 వేల సొత్తు అపహరణ


చోరీ సంఘటనను పరిశీలిస్తున్న ఎస్ఐ షాకీర్

కల్లూరు, ఆగస్టు 6 కల్లూరులోని చంద్రుపట్ల రహదారి వైపున గల ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసి సుమారు రూ.50 వేల సొత్తును అపహరించారు. స్థానికగా చంద్రుపట్ల రహదారి వైపున గల కాటంనేని శ్రీనువాసరావు ఇంట్లో ఎవరు లేని సమయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తలుపులను పగలగొట్టి బీరువాల్లో ఉన్న రూ.25 విలువగల పట్టీలు, చేవి దుద్దులు, మరో రూ.25 వేల నగదును అపహరించారు. ఇంటి యాజమాని శ్రీనివాస రావు తన భార్యతో కలిసి మోకాళ్ల ఆపరేషన్ చేయించుకునేందుకు వారం క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. ఇంట్లో ఎవరు లేరన్న విషయాన్ని గమనించిన దుండగులు చోరీ చేశారు. మంగళవారం ఉదయం సమీపంలోని ఇంటి యజమాని ఎనోష్‌కుమార్ ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటాన్ని గమనించి, వచ్చి చూడగా చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. క్లూస్ టీం, పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు ఎస్ఐ ఎస్‌కే షాకీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రభుత్వ పథకాలు అందజేయడంలో న్యాయసేవా సంస్థ కృషి చేస్తుంది'


వీల్‌చైర్లను అందజేస్తున్న అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి కల్పన

ఖమ్మం లీగల్ ఆగస్టు 6: అర్హులైన ప్రజలకి ప్రభుత్వం రూపొందించిన వివిధ పథకాలు అందజేయడంలో న్యాయసేవాసంస్థ సమన్వయకర్తగా వ్యవహరిస్తుందని అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి, న్యాయసేవాసంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ఎం. కల్పన అన్నారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ ఆదేశాల మేరకు న్యాయాధికారి మంగళవారం ఉదయ్‌నగర్‌లోని దివ్యాంగ కుటుంబాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ జోగు భాగ్యమ్మ దుస్థితిని సమాచార మాధ్యమాల ద్వారా తెలుసుకున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. రాజగోపాల్ ఆదేశించడంతో తాను వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబానికి వీల్ చైర్ అందజేశారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఆ కుటుంబ అవసరాలను తెలుసుకున్న న్యాయాధికారి వారి ద్వారా ఒక దరఖాస్తును స్వీకరించారు. తదుపరి ఆదేశాల నిమిత్తం దరఖాస్తును జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, జిల్లా సంక్షేమ అధికారి రామ్‌గోపాల్‌రెడ్డి సహకారంతో చక్రాల కుర్చీని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు మామిడి హనుమంతరావు, మల్లెబోయిన వలరాజు, తొర్రికొండ శ్రీను, కల్లేపల్లి జ్యోతి, బానోతు సుశీల పాల్గొన్నారు.

దారి దోపిడీకి పాల్పడిన దొంగల అరెస్ట్


వివరాలను వెల్లడించిన డీఎస్పీ రహమాన్

- ఆరుగురి నిందితులకు రిమాండ్
- 12 తులాల బంగారం, 2 ద్వి చక్ర వాహనాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రహమాన్

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు6: దారి దోపిడీకి పాల్పడిన ఆరుగురి నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రహమాన్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో దారి దోపిడి కేసు వివరాలను వెల్లడించారు. లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ తన సిబ్బందితో కలిసి మం డల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎస్. నాగేంద్రబాబు అలియాస్ మల్లన్న(పెనుబల్లి, చుంచుపల్లి మండలం), పడిగా బేబీ అలియాస్ సాయిశ్రీలు(కొత్తగూడెం, కూలీలైన్‌ఏరియా) రేగళ్ల వైపు నుంచి ద్వి చక్ర వాహనంపై వస్తూ వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా, వారిని పోలీసులు పట్టుకున్నారు.

విచారణలో గత నెల ఒకటవ తేదీన మండల పరిధిలోని అనిశెట్టిపల్లి గ్రామం పీతిరిగుట్ట సమీపంలోని అటవీప్రాంతంలో తిరుపతి అనే వ్యక్తిని కొట్టి ఆయన వద్ద నుంచి బంగారు గొలుసు తోపాటు, రూ.15,000 వేలు దొంగిలించినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. నిందితురాలు పడిగా సాయిశ్రీ(బేబీ)కి బాధితుడు తిరుపతితో ఉన్న పరిచయం ఉంది. కాగా అదే రోజు బాధితుడిని బేబీ కొత్తగూడేనికి పిలిపించుకుని అతడి కారు లో తిరుగుతూ బేబీ పథకం ప్రకారం నాగేంద్రబుబు కు ఫోన్‌చేసి తమను అనుసరించమని చెప్పగా, నాగేంద్రబాబు తనతోపాటు షేక్ ఇర్ఫాన్ అలియాస్ మున్నా (ప్రశాంతినగర్, లక్ష్మీదేవిపల్లి), భూపతి అరవింద్(విద్యానగర్‌కాలనీ), నక్కిడపు దుర్గాప్రసాద్ అలియాస్ బన్నీలు కలసి రెండు ద్వి చక్ర వాహనాలపై కారును అనుసరించారు. బాధితుడు తిరుపతిని మాటల్లో పెట్టి కారులో అనిశెట్టిపల్లి పితిరి గుట్ట వద్ద కారును ఆపించి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లింది. అక్కడ వీరిని అనుసరించి వచ్చిన నిందితులు తిరుపతి ముఖంపై కారం చల్లి, అతడిని నమ్మించేందుకు అతడితో వెంట వచ్చిన బేబీని సైతం కొట్టి తిరుపతి వద్ద నున్న ఆభరణాలు, నగదును సెల్‌ఫోన్, కారుతాళాన్ని లాక్కున్నారు. అతడికి అనుమానం రాకుండా ఉండేందుకు బేబీ వద్ద నుంచి సెల్‌ఫోన్‌ను సైతం లాక్కున్నారు. బాధితుడి కంట్లో కారం పడటం వలన అతను అక్కడే ఉండగా, బాధితుడి వెంట వచ్చిన ఆమె అక్కడి నుంచి బయటకు కొద్ది దూరం రాగా, దోపిడీదారులు నలుగురు కలిసి ఆమెను తీసుకుని విద్యానగర్‌కాలనీకి చేరుకుని అక్కడి నుంచి ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు.

మరుసటి రోజు జూలై 2న నిందితులు అందరూ వీరి స్నేహితుడైన దామోదర్ (దాము)ను పాల్వంచలో కలుసుకుని తిరుపతి వద్ద నుంచి దోచుకున్న బంగారు చైన్‌ను బేబీకి ఇచ్చి, రూ.15,000వేలను అందరూ పంచుకున్నారు. ఇదిలా ఉండగా అగస్టు 6తేదీన మంగళవారం బేబీ అద్దెకు ఉంటున్న ఇంటికి నిందితులు నలుగురు వెళ్లి ఇంకా డబ్బులు కావాలని ఆమెను అడగగా, గట్టుమల్లలోని తమ ఇంటి వద్ద తిరుపతి వద్ద నుంచి తీసుకున్న బంగారం గొలుసును దాచి పెట్టినట్లు తెలిపింది. ఆ చైన్‌ను తీసుకొచ్చి అమ్మి డబ్బులు ఇస్తానని, గొలుసును తెచ్చేందుకు బేబీ తనవెంట నాగేంద్రబాబును గట్టుమళ్లకు ద్విచక్ర వాహనంపై వెళ్లి బంగారు గొలుసును తీసుకుని తిరిగి వస్తుండగా, రేగళ్ల ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారని తెలిపారు. వీరిని విచారించగా మరో ముగ్గురుతో పాటు దామోదర్ అనే నిందితుడిని అదుపులోకి తీసుకురని పేర్కొన్నారు.

వీరి వద్ద నుంచి 3తులాల బంగారు గొలుసు, 8 గ్రాముల బంగారు ఉంగరం, 6 ఫోన్లు, 2 ద్విచక్రవాహనాలను వారి వద్ద నుంచి స్వాధీన పర్చుకుని కేసు నమోదు చేశారని తెలిపారు. నిందితులను పట్టుకున్న సీసీఎస్ ఇన్స్పెక్టర్ సత్యనారయణ, ఎస్ఐలు జె.ప్రవీణ్, సుమన్, రామారావు, లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ రమణారెడ్డి, సిబ్బందిని ఎస్పీ రోహిత్‌రాజు, డీఎస్పీలు అభినందించారు.

భార్య కాపురానికి రాదని భర్త ఆత్మహత్య

దుమ్ముగూడెం ఆగస్టు6: భార్య కాపురానికి రాదని మనస్తాపంతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని సీతానగరంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సీతానగరానికి చెందిన ఆటో డ్రైవర్ ఏనిక విజయ్(29)కు అశ్వనితో వివాహం జరగ్గా, వారికి ఇద్దరు పిల్లలున్నారు. కొంత కాలంగా భార్య, భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. సుమారు నాలుగు నెలల క్రితం అశ్వని భర్త, పిల్లల్ని వదిలి తన పుట్టింటికి వెళ్లిపోయింది. నాటి నుంచి విజయ్ మద్యం సేవిస్తూ ఆటో నడుపుకొని జీవిస్తున్నాడు. ఈనెల 5న పిల్లలను చూడడానికి అశ్వని సీతానగరం వచ్చింది. కాగా భార్య, భర్తల మధ్య మరోసారి ఘర్షణ జరిగింది. దీంతో ఆమె మరలా పుట్టింటికి వెళ్లిపోయింది. ఇకమీదట తన భార్య కాపురానికి రాదని మనస్తాపం చెందిన అతడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు వెంటనే అతడిని భద్రాచలం ఆసుపత్రికి తరలించగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తూ బావిలో పడి రైతు మృతి

బోనకల్, ఆగస్టు 6: ప్రమాదవశాత్తూ బావిలో పడి ఓ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పత్తి వెంకటేశ్వర్లు(63) పొలం చూసేందుకు వెళ్లాడు. బావి వద్ద విద్యుత్ మోటార్‌ను చూసే క్రమంలో ప్రమాదవశాత్తూ కాలు జారీ బావిలో పడ్డాడు. రైతులు ఇంటికొచ్చే సమయంలో కొందరూ బావిలో మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరావు, డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు ఉమ్మినేని కోటయ్య, గుద్దూరి ఉమ, వెంకటనర్సయ్య, రాధాకృష్ణ, రామకోటయ్య సందర్శించి నివాళులర్పించారు.

వర్షానికి నేలమట్టమైన ఇళ్లు

బూర్గంపాడు, ఆగస్టు 6: బూర్గంపాడు మండల పరిధిలోని ఇరవెండి ఎస్టీ కాలనీకి చెందిన కణితి బాబురావు ఇళ్లు మంగళవారం కూలిపోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు బాబురావు రేకుల షెడ్డు ఒక్కసారిగా కూలింది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కూలిపోయిన ఇంటిని ఆర్ఐ ముత్తయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుదని భరోసా కల్పించారు.

గోదావరిలో గల్లంతైన మహిళ మృతదేహం కోసం గాలింపు

భద్రాచలం, ఆగస్టు 6: భద్రాచలంలోని గోదావరి వారధిపై నుంచి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన భూక్య శైలజ మృతదేహం కోసం మంగళవారం గజ ఈతగాళ్ల నదిలో గాలింపు చర్యలు నిర్వహించారు. భద్రాచలం నుంచి కూనవరం వరకు గజ ఈతగాళ్ల బృందం ప్రసాద్ ఆధ్వర్యంలో గాలింపులు నిర్వహించారు. కాగా సాయంత్రం వరకు ఆమె మృతదేహం లభ్యం కాలేదని వారు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఖమ్మం క్రైం, ఆగస్టు 6: ఎర్రుపాలెం మండలానికి చెందిన ఓ యువకుడిపై నగరంలోని ఓ పోలీస్‌స్టేషన్ నందు మంగళవారం పోక్సో కేసు నమోదైంది. ఎర్రుపాలెం మండలానికి చెందిన 24 ఏళ్ల యువకుడు నగరానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఇంటి వద్దకు వచ్చి వేధిస్తున్నాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో నగరం లోని ఓ పోలీస్‌స్టేషన్‌లో యువకుడిపై పోక్సో కేసు నమోదైంది.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

● ఇద్దరిపై కేసు నమోదు

జూలూరుపాడు, ఆగస్టు 6: మండలంలోని బేతాళపాడు, కొమ్ముగూడెం గ్రామాల్లోని దుకాణాలలో మంగళవారం ఎస్ఐ రాణా ప్రతాప్ తన సిబ్బందితో కలిసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో బేతాళపాడు గ్రామంలో చలమల రమేష్, కొమ్ముగూడెం గ్రామంలో గుగులోత్ బాలుల నుంచి రూ. 8వేల విలువ చేసే గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరి వ్యాపారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గుట్కా ప్యాకెట్లను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ తిరపతిరావు, హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య సిబ్బంది రామకృష్ణ, సూర్యం తదితరులున్నారు.

కూలిన భారీ వృక్షం..

● తప్పిన పెనుప్రమాదం


అన్నారుగూడెంలో జాతీయ రహదారిపై కూలిన భారీవృక్షం

తల్లాడ, ఆగస్టు6: తల్లాడ మండలం అన్నారుగూడెం వద్ద మంగళవారం సాయంత్రం భారీ వృక్షం నేలకూలింది. కూలిన సమయంలో వాహనాల రాకపోకలు, ప్రజల సంచారం లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. అన్నారుగూడెం వద్ద తల్లాడ-కుంట జాతీయ రహదారిలో భారీ వృక్షం నేలకూలింది. గంటకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ సంఖ్యలో బస్సులు, లారీలు, కార్లు వంటి వాహనాలు నిలిచిపోయాయి. ఎస్ఐ కొండలరావు సంఘటనా స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్ సహాయంతో చెట్టును తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.



పరిశుభ్ర తాగునీటిని పంపిణీ చేయాలి

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు6: ఖమ్మం ప్రజలకు పరిశుభ్ర తాగునీటిని పంపిణీ చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ఆదేశించారు. మంగళవారం ఖమ్మంలోని పలుతాగునీటి ట్యాంకులను తనిఖీలు చేశారు. నీటిశ్యాంపిల్స్‌ను క్లోరోస్కోప్‌లో పరిశీలించారు. కేఎంసీ అధికారులు, ఉద్యోగులకు అవగాహన కల్పించారు. నీటిట్యాంకుల పరిశుభ్రత విషయంలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏఏ ప్రాంతాల నుంచి నీటిపంపిణీ జరుగుతుందో తెలుసుకున్నారు. వర్షపు నీటి సంరక్షణపై స్థానికులకు వివరించారు. అసిస్టెంట్ కమిషనర్ సంపత్, ఈఈలు, డీఈలు, వాటర్ సప్లయ్ సిబ్బంది పాల్గొన్నారు. 25వ డివిజన్‌లో కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యటించారు. పాతమున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీపార్కు వరకు రహదారుల వెంట నిల్వ ఉన్న నీరును పరిశీలించారు. అందుకు గల కారణాలను సంబంధిత అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు.





తల్లాడలో ఇళ్లమధ్య పోటెత్తిన వరద నీరు, నీటమునిగిన వరిని చూసుకుంటున్న రైతులు, తీగలబంజర-లాలాపురం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న పగిడేరు వరద

తల్లాడలో భారీవర్షం

- జిల్లాలో అత్యధికంగా నమోదు
- పొంగి ప్రవహించిన వాగులు, స్తంభించిన రాకపోకలు
- కొణిజర్ల మండలంలో పది గ్రామాలకు రాకపోకలకు అంతరాయం

తల్లాడ, ఆగస్టు6: మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. కురిసిన భారీవర్షం వరద ఉధృతికి వాగులు పొంగి ప్రవహించాయి. జిల్లాలోనే అత్యధికంగా తల్లాడ మండలంలో 128.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీవర్షం వలన వరద ఉధృతికి మాచవరం, కట్టలేరు, గంగదేవిపాడు, కేశవాపురం వాగులు పొంగి ప్రవహించాయి. వాగులో వరద పోటెత్తడం వలన మండలంలోని బిల్లుపాడు-రామచంద్రాపురం, బిల్లుపాడు-కొత్తవెంకటగిరి, పినపాక-వెంకటాపురం, వెంకటాపురం-కేశవాపురం, నూతనకల్-గూడూరు గ్రామాల మధ్య ఆర్అండ్‌బి రహదారులలో ఉదయం 6గంటల నుంచి ఐదారు గంటల పాటు రాకపోకలు స్తంభించిపోయాయి. మండలంలోని పలు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లమధ్య వరద నీరు పోటెత్తింది. తల్లాడలోని సబ్ స్టేషన్ రోడ్, వెంకట్రామా థియేటర్, శివాలయం, దళితకాలనీ ప్రాంతాలలో ఇళ్ల మధ్య నిలిచిన వరద నీరును ఎంపీవో కొండపల్లి శ్రీదేవి, ఈవో కృష్ణారావు, కాంగ్రెస్ మండల నాయకులు రాయల రాము పరిశీలించారు. ఇళ్ల మధ్య నిలిచిన వరదనీరును బయటకు పంపేందుకు జేసీబీ సహాయంతో ప్రత్యేకంగా ట్రెంచ్ ఏర్పాటు చేశారు. పత్తి, వరి పైర్లు నీటమునిగి పంటలకు నష్టం వాటిల్లింది.

రాత్రికి రాత్రే నిండిన వాగులు: రాకపోకలకు అంతరాయం

కొణిజర్ల: రాత్రికిరాత్రే భారీవర్షం పడటంతో మండలంలోని వాగులు నిండిపొర్లుతున్నాయి. వాగులు పొర్లడంతో మంగళవారం పది గ్రామాలకు పైగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 78.6 మి.మి వర్షపాతం నమోదు అయింది. పల్లిపాడు నుంచి ఏన్కూర్ భద్రాద్రి,కొత్తగూడెం వెళ్లే వాహనాలకు రాకపోకలు నిచిపోయాయి. పల్లిపాడు మీదగా లాలాపురం- తీగలబంజర గ్రామాల మధ్య పగిడేరు పొంగి రోడ్డుపై ప్రవహించడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. తహసీల్దార్ తఫ్జల్ హుస్సేన్, ఎంపీవో రాజేశ్వరి, ఎస్ఐ శంకర్‌రావు పోలీస్‌సిబ్బందితో జాగ్రత్త చర్యలు చేపట్టారు. పల్లిపాడు నుంచి వాహనాలను వెళ్ళకుండా భారీకేట్లు పెట్టి చర్యలు చేపట్టారు. దాంతో మండలంలోని పల్లిపాడు, లాలాపురం, తీగలబంజర, సాలెబంజర, సింగరాయపాలెం, గుండ్రాతి మడుగు, గుబ్బగుర్తి, అంజనాపురం, రాంపురం, గద్దలగూడెం, ఉప్పలచలక, లక్ష్మీపురం గ్రామాలకు రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ప్రజలంతా ఇళ్లకే పరిమితం అయ్యారు. అలాగే కొణిజర్ల-మల్లుపల్లి మధ్య వాగు రహదారి నుంచి పొంగటంతో మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తుమ్మలపల్లి-అన్నవరం మధ్య వాగు రోడ్డుపై పొంగిపొర్లటంతో ఆ రెండు గ్రామాలకు రకాపోకలు నిలిచిపోయాయి. వరి, పత్తి పంటలు వరదనీటితో మునిగిపోయాయి. రోడ్లన్ని గుంతలు మయంగా తయారయ్యాయి. లింగగూడెం పంచాయతీ బస్వాపురంలో నిర్మించిన వైరా మార్కెట్ గోదాము చుట్టూ వరదనీరు చేరింది. నీరు బయటకు పోయే పరిస్థితిలేక గోదాము నీటితో నిండింది.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- ప్రజావాణి, మధ్యాహ్న భోజనం, కలెక్టరేట్‌లో సౌకర్యాలపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు6: ప్రజల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో మండలస్థాయి ప్రజావాణి, బుధవారం పాఠశాల భోజనం, కలెక్టరేట్‌లో సౌకర్యాల కల్పనపై ఆయన సమీక్షించారు. 90శాతం ప్రజాసమస్యలు గ్రామ, మండల స్థాయిల్లోనే పరిష్కారం అవుతాయని, మండల అధికారులు చర్యలు చేపట్టకపోవడం, స్పందించక పోవడంతో కలెక్టరేట్‌కు వస్తున్నాయన్నారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం చేపట్టి, ప్రజలకు ఇబ్బందులు, సమయం, డబ్బు వృథా కాకుండా, తహసీల్దార్ కార్యాలయంలో అర్జీల స్వీకరణ చేస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో స్వీకరించిన అర్జీలు వేగంగా పరిష్కారం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. గతసోమవారం ప్రజా వాణిలో జిల్లావ్యాప్తంగా 536 అర్జీలు స్వీకరించినట్లు చెప్పారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 363 అర్జీలు ఉన్నట్లు ఆయన అన్నారు. జిల్లా అధికారులు, తమ శాఖకు సంబంధించి వచ్చిన అర్జీలు, ఏ సమస్యలతో ఉన్నాయో మండలాల వారిగా పరిశీలించి, శుక్రవారం లోగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీబుధవారం పాఠశాలభోజనం కార్యక్ర తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ గేటువద్ద బస్ స్టాప్ పనులు జరుగుతున్నట్లు, ప్రతి బస్ కలెక్టరేట్ వద్ద ఆగేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన అన్నారు. తాగునీటికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 15రోజుల్లో బ్యాంకు ప్రారంభిస్తామని, క్యాంటీన్‌ను వారంలో తెరవనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్‌శ్రేష్ఠ, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి,జిల్లాఅధికారులు పాల్గొన్నారు.

పదోన్నతులు లేకుండా బదిలీలు చేయొద్దు

- ఐఎన్‌టీయూసీ 327జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి




మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి, ప్రసాద్, శంకర్

సత్తుపల్లి, ఆగస్టు6: విద్యుత్‌శాఖలో పదోన్నతులు లేకుండా బదిలీలు చేయొద్దని రాష్ట్రవిద్యుత్ ఉద్యోగుల సంఘం ఐఎన్‌టీయూసీ 327జిల్లా అధ్యక్షుడు ఎం. సత్యనారాయణరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో సత్తుపల్లి డివిజన్ ఎన్నికలతో పాటు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇతర సంఘాలు మహా సముద్రం లాంటివని, వ్యక్తిగత పరిచయాలు అన్నిచోట్లా పనిచేయవని, మా సంఘం మాత్రం ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. చెట్టువలనే సంఘ సభ్యులకు నీడనిచ్చి కాపాడుతుందని, సంఘాన్ని ఉద్యోగులంతా నమ్ముకోవాలని కోరారు. పదోన్నతులు, బదిలీలు, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ పెన్షన్, ఆర్టిజన్స్, అన్‌మ్యాన్డ్ వర్కర్ల సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఇతర సంఘాల నుంచి పలువురు 327యూనియన్‌లో చేరారు.

డివిజన్ అధ్యక్ష,కార్యదర్శులుగా ప్రసాద్, శంకర్

అనంతరం డిజజన్ కమిటీని ఎన్నుకోగా అధ్యక్ష, కార్యదర్శులుగా డీఎస్‌వీ.ప్రసాద్, బీ.శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కే.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా జీ. రాందాసు, ఎం.పూర్ణచందర్‌రావు, జాయింట్ సెక్రటరీగా బీ.రాందాసు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జీ.శ్రీనివాసరావు, ఆఫీస్ ప్రతినిధిగా బీ.చంద్రకళ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. కార్యక్రమంలో నాయకులు మందడపు శ్రీనివాస రావు,సీతారంగోపాల్,రవికుమార్, సత్యనారాయణ, జయ ప్రకాష్, నర్సింహారెడ్డి, ఇస్మాయిల్, రాందాసు, ముత్యాలరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం డిపోలో మొక్కలు నాటిన ఆర్ఎం



ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు6: ఖమ్మం బస్ డిపో ఆవరణలో మంగళవారం రీజనల్ మేనేజర్ సరిరాం, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్) పవిత్ర, డిపో మేనేజర్ దినేష్‌కుమార్ 50మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటి దాని పరిరక్షణ భాధ్యతను తీసుకోవాలని ఆర్ఎం తెలిపారు. అనంతరం డిపోలో ఆయిల్ సేవ్ చేసిన డ్రైవర్లను, డిపోలో అత్యుత్తమ పని తీరు కనబరిచిన సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) రామయ్య, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజాయుద్ధనౌక గద్దర్‌కు ఘన నివాళి



అమరుల స్థూపం వద్ద వామపక్ష, ప్రజాసంఘాల నేతల నివాళి

ఖమ్మంసాంస్కృతికం,ఆగస్టు6: ప్రజాయుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళ వారం ఖమ్మంలోని తెలంగాణ అమరుల స్థూపం వద్ద నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో దేవిరెడ్డి విజయ్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా నాయకులునర్సింగరావు, సీపీఐ ఎంఎల్‌మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, న్యూడెమోక్రసీ నాయకులు గిరి, తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు, అడ్వకేట్ జేఏసీజిల్లా ఛైర్మన్ బిచ్చాల తిరుమలరావు, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు నరేందర్, బాబురావు, ముస్లిం జేఏసీ కన్వీనర్ అబ్దుల్ రెహమాన్, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు లింగాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ యండపల్లి దంపతులకు సన్మానం



వరప్రసాద్, సింధును సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మంరూరల్, ఆగస్టు6:జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, సింధు దంపతులను ఖమ్మంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. జడ్పీటీసీ సభ్యుడిగా పదవీకాలం ముగియడంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. పదవికే విరమణ తప్ప ప్రజా సేవకు కాదని, తాను నిరంతరం ప్రజాసేవలోనే ఉంటానని వివరించారు. పదవీకాలంలో సహకరించిన అన్ని పార్టీల నాయకులు,అధికారులు, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధు, జెడ్పీఛైర్మన్ లింగాల కమల్‌రాజు, బెల్లం వేణు గోపాల్ సన్మానించారు.

బీవీకే గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

ఖమ్మంటౌన్,ఆగస్టు6:నగరంలోని బోడెపూడి విజ్ఞాన కేంద్రం (బీవీకే) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయానికి బ్యాంక్ కాలనీకి చెందిన సుంకర ప్రసాద్ పుస్తకాలను వితరణ చేశారు. మంగళవారం ప్రసాద్ కుమారుడు గ్రంథాలయానికి వచ్చి సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, గ్రంథాలయ ఇన్‌ఛార్జ్ ఎస్‌కే. అఫ్జల్‌కు పుస్తకాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో బీవీకే మేనేజర్ వై.శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు ఎం.సుబ్బారావు, జిల్లా కార్యాలయం ఇన్‌ఛార్జ్ ఆర్.ప్రకాష్, గోపి పాల్గొన్నారు.

సత్తుపల్లి ఎంఈవోగా వెంకటేశ్వరరావు



సత్తుపల్లిరూరల్, ఆగస్టు6: సత్తుపల్లి ఎంఈవోగా చలంచర్ల వెంకటేశ్వరరావుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీఈవో సోమశేఖరశర్మ నుంచి మంగళవారం ఉత్తర్వులు అందాయి. ఈయన వేంసూ రు, పెనుబల్లి మండలాల విద్యాశాఖాధికారిగా ఉండగా సత్తుపల్లికి అదనపు బాధ్యతలు అప్పగించగా చౌడవరం హెచ్ఎంగా పనిచేస్తున్నారు. 19ఏళ్లపాటు సత్తుపల్లి ఎంఈవోగా విధులు నిర్వహించిన రాములు రఘునాధపాలెం మండలానికి బదిలీ అయ్యారు.

పీహెచ్‌సీలో కుర్చీల చోరీ

ముదిగొండ,ఆగస్టు6: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం అర్థరాత్రి చోరీ జరిగింది. పీహెచ్‌సీలో 16 కుర్చీలను ఎత్తుకెళ్లారు. కొద్దిరోజుల క్రితం ఫ్యాన్లు ఎత్తుకెళ్లారని మండల వైద్యాధికారి అరుణాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎస్‌బీ ఏసీపీ ప్రసన్నకుమార్ బదిలీ

ఖమ్మంక్రైం ఆగస్టు 6: ఖమ్మం స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ ప్రసన్నకుమార్‌ను మెదక్ డీఎస్పీగా బదిలీ చేస్తూ పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో ఏసీపీ వెంకటేశ్‌ను నియమిస్తున్నట్లు సమాచారం.

వివాహం చేసుకొని మోసం

ఖమ్మంక్రైం ఆగస్టు 6: రహస్యంగా వివాహం చేసుకొని తనను మోసంచేశాడని ఓ యువతి ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసింది. నగరానికి చెందిన ఓ యువతికి వివాహ పరిచయ వేదికద్వారా గోదావరిఖనికి చెందిన పడబోయిన ప్రవీణ్‌కుమార్ 2022లో పరిచయం అయ్యాడు. కొంతకాలంపాటు వివాహం చేసుకుంటానంటూ నమ్మించి ఆమెతో సహజీవనం చేశాడు. కొంతకాలం తర్వాత ఆమె ఒత్తిడి చేయటంతో రహస్య వివాహం చేసుకున్నాడు. ఒక పాప పుట్టన తర్వాత కనిపించకుండా పోవటంతో సదరు యువకుడిపై యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. టూటౌన్ పోలీసులు కేసునమోదు చేశారు.

ఉన్నతాధికారుల సేవలో పంచాయతీ కార్యదర్శులు

- డీఎల్‌పీవో డ్రైవర్‌గా గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి
- పచ్చదనం స్వచ్ఛదనంలో గ్రామాల వైపు చూడని వైనం



డీఎల్‌పీవో కారు నడుపుతున్న గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి

రఘునాథపాలెం, ఆగస్టు 6: పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్రప్రభుత్వం ఈనెల 5నుంచి 9వరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమానికి పిలుపునిచ్చింది. కార్యక్రమం విజయవంతంలో పంచాయతీ కార్యదర్శిలే ఎంతో కీలకంగా పనిచేయాల్సి ఉంటుంది. అటువంటి కార్యదర్శిలు ఇటీవలపలు మండలాల్లో ఎంపీడీవోలు, ఎంపీవోలకు కారు డ్రైవర్లగా పనిచేస్తూ వారికి కేటాయించిన గ్రామాలకు వెళ్లటం లేదని బహిరంగ విమర్శలు వెలువడుతున్నాయి. జిల్లా స్థాయిలో కలెక్టర్ నిర్వహించే సమావేశాలకు పలువురు ఎంపీడీవోలు పంచాయతీ కార్యదర్శలనే డ్రైవర్‌గా కలెక్టరేట్‌కు తీసుకొస్తున్నారు. ఈ క్రమంలోనే ఎంతో కీలకమైన ఖమ్మం డీఎల్‌పీవో బుధవారం గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శిని కారు డ్రైవర్‌గా వినియోగిస్తూ రఘునాథపాలెం మండలంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం పర్యవేక్షణ చేశారు. ఇది ఎంతవరకు సబబో జిల్లా అధికారులే తెల్పాలని తోటి పంచాయతీ కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు.

నోటుపుస్తకాలు పంపిణీ

ఏన్కూరు,ఆగస్టు6:మండలంలోని నాచారం ప్రాథమి కోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళ వారం కొప్పుల గోపయ్య, నాగరత్నం మెమోరియల్ ట్రస్టు, రామకృష్ణ హెల్పింగ్‌హ్యాండ్ ఆధ్వర్యంలో పది వేల విలువైన నోటుపుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు అందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామకృష్ణ, హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు దుర్గానాద్, చెరుకు అప్పారావు, ఒక్కంతుల సాగర్ పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నంబూరి నారాయణరావు సహకారంతో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ దారా శ్రీనివాస రావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు, కటికి వెంకటేశ్వర్లు, వేమిరెడ్డి వెంకట నారాయణరెడ్డి, దగ్గుల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

చింతకాని, ఆగస్టు 6: మండల పరిధిలోని నేరడ గ్రామానికి చెందిన ఓవివాహిత అదృశ్యమైనట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. సదరు మహిళ ఈనెల3న భర్త పొలానికి వెళ్లి ఇంటికి తిరిగి రాగా ఇంటి వద్ద భార్య లేదు. ఆచూకీ కోసం బంధువుల వద్ద ప్రయత్నించి నప్పటికీ ఫలితం లేకపోవడంతో భర్త ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేశారు.

ఉరేసుకుని ఆత్మహత్య

ఖమ్మంరూరల్,ఆగస్టు6: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం గ్రామానికి చెందిన ఎన్.రవి (34)కూలీ పనులు చేసు కుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై పనికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు మందలించారు. మనస్థాపం చెందిన రవి ఇంటికి సమీపంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

ఖమ్మంఖానాపురంహవేలి,ఆగస్టు6: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఖమ్మం అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని 39వ డివిజన్ నిజాంపేట సెక్టార్ పరిధిలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డివిజన్ కాంగ్రెస్ నాయకులు సైదారావు, వెంకన్న, జానీమియా, రామారావులు హజరై మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఊరుకొండ చంద్రిక, వాణి, అంగన్‌వాడీ టీచర్లు సునీత, హుస్సేన్‌బీ, గోవిందమ్మ, శ్యామల, మునిసిపల్ కార్పోరేషన్ మేనేజర్ విజయానంద్ పాల్గొన్నారు.

వక్ఫ్‌బిల్లు సవరణతో అణగదొక్కే ప్రయత్నం

ఖమ్మంటౌన్, ఆగస్టు6: కేంద్రప్రభుత్వం వక్ఫ్‌బిల్లు సవరణ ద్వారా ముస్లిం, మైనారిటీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నదని ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మహమ్మద్ సలాం విమర్శించారు. మంగళవారం నగరంలోని లెనిన్‌నగర్‌లో ఎస్‌కే. చాన్ అధ్యక్షతన జరిగిన ఇన్సాఫ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు ఖాసీం పాషా, కరీం పాల్గొన్నారు.

వేపకుంట్ల మాజీ సర్పంచ్‌కి పితృవియోగం

రఘునాథపాలెం, ఆగస్టు6: వేపకుంట్ల మాజీ సర్పంచ్ రేమర్ల రమేశ్ తండ్రి రాములు(80) అనారోగ్యంతో మంగళవారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ కార్పొరేటర్లు మలీదు వెంక టేశ్వర్లు, మలీదు జగన్, లకావత్ సైదులు నాయక్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, మారం కరుణాకర్‌రెడ్డి, కొంటేముక్కల నాగేశ్వరరావు, నల్లమల్ల సత్యంబాబు తదితరులు రాములు నివాళులు అర్పించారు.

విద్యాప్రవేశ్ అమలుపై సర్వే



విద్యార్థులతో మాట్లాడుతున్న పూజ పటేల్

ఖమ్మంఖానాపురంహవేలి,ఆగస్టు6: దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న విద్యా ప్రవేశ్‌నిర్వాహణను పరిశీలించే నిమిత్తం కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సర్వేలో భాగంగా మంగళవారం ఖమ్మం ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో ఎన్సీఈఆర్టీ న్యూఢిల్లీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పూజ పటేల్ సర్వే నిర్వహించారు. తరగతి నిర్వహణ. విద్యార్థుల ప్రగతి ఉపాధ్యాయుల పనితీరు. పాఠశాల నిర్వహణలో ప్రధానోపాధ్యాయుల పాత్ర,క్రీడలు, మైదానం, పాఠశాల అభివృద్ధిలో తల్లితండ్రుల భాగస్వామ్యం మొదలగు అంశాలపై సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కె రవికుమార్, ఎంఈఓ శ్రీనివాస్, క్షేత్ర స్థాయి పరిశీలకులు టీ.జీవన్, ఏ.రవి పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై క్విజ్

ఖమ్మంకలెక్టరేట్,ఆగస్టు6: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ , మాతా శిశుసంరక్షణ కేంద్రంలో వివిధ నర్సింగ్ కాలేజ్ విద్యార్థినులకు తల్లిపాల ప్రాముఖ్యతపై క్విజ్ నిర్వహించారు. విజేతలకు మెమోంటో అందచేశారు. ఈకార్యక్రమం ఆస్పత్రి సూపరిం టెండెంట్ ఎల్ కిరణ్ కుమార్, డిప్యూటీ సూపరిం టెండెంట్ బి.కిరణ్ కుమార్, ఎంసీహెచ్ సూపరిం టెండెంట్ బాబూరత్నాకర్, గైనిక్‌హెచ్‌వోడీ యామిని, పిల్లల వైద్యులు పవన్, రాంబాబు పాల్గొన్నారు

ఉపాధ్యాయుల వినతి.. పాఠశాలకు సీసీ రోడ్డు మంజూరు

మధిర,ఆగస్టు 6: మధిరలోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌కు వెళ్లే దారి బుడుగుతేలింది. దీనిపై పాఠ శాల ఉపాధ్యాయులు మధిర వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రం అందించారు. స్పందించిన భట్టి అప్పటికప్పుడే సీసీ రోడ్డు మంజూరిచేస్తూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ప్రిన్సిపాల్ సిస్టర్ ఆన్‌బేబీ, కరస్పాండెంట్ మకేరీ థామస్, ఉపాధ్యాయులు వెంకటనారాయణ, విజయ్‌కుమార్, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీలో చేరేందుకు గడువు పొడిగింపు

మధిర, ఆగస్టు 6: బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో డిగ్రీలో చేరేందుకు ఈనెల 18 వరకు గడువు పొడిగించినట్లు మధిర అధ్యయన కేంద్రం ప్రిన్సిపాల్ జీ అరుణ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులలో చేరగోరే విద్యార్థులు ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు. ఇంటర్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్, డిప్లొమా, పాలిటెక్నిక్, ఒకేషనల్ కోర్సులు పాస్ అయినవారు నేరుగా చేరవచ్చని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంటౌన్, ఆగస్టు6:ముఖ్యమంత్రి సహాయనిధి రూ.34లక్షల 67వేలు విలువగల 106 చెక్కులను జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తాతామధు లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ మరికంటి ధనలక్ష్మీ, మాజీ జెడ్పీటీసీ పోట్లశ్రీను, కవిత, మాజీ జెడ్పీటీసీ వరప్రసాద్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్, ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు బెల్లంవేణు, తిరుమలాయపాలెం మండల నాయకులు చామకూరి రాజు పాల్గొన్నారు.